నమస్తే తెలంగాణ
ఖమ్మం
3 | ఖమ్మం, ఆదివారం 18 ఆగస్టు 2024 | KHAMMAM

కందుకూరు పాఠశాల ఎదుట ధర్నా

కందుకూరు ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వేంసూరు, ఆగస్టు 17 : సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో చదువులు ముందుకు సాగడం లేదని, వెంటనే ఉపాధ్యాయులను నియమించి తమకు న్యాయం చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కందుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో 6 నుంచి పదో తరగతి వరకు 204 మంది విద్యార్థులున్నా సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఎలా రాయాలోనని దిగులు చెందుతున్నారని అన్నారు. ఇద్దరు తెలుగు, ఇద్దరు జీవశాస్త్రం, ఒక హిందీ టీచర్ ఇటీవల బదిలీ కావడంతో ఖాళీలు ఏర్పడ్డాయని, ఆ పోస్టుల్లో ఇంతవరకు ఎవరినీ కేటాయించలేదని ఆరోపించారు. దీనిపై ఎంఈవో వెంకటేశ్వర్లును విద్యార్థుల తల్లిదండ్రులు ఫోన్‌లో సంప్రదించగా.. ఇది తన పరిధిలో లేదని, జిల్లాస్థాయి పరిధిలో ఉన్నదని తెలిపారు. ఈ క్రమంలో డీఈవోకు ఫోన్ చేయగా.. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవమేనని, మంగళవారం వరకు టీచర్లను సర్దుబాటు చేస్తామని చెప్పారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

మార్గదర్శకాల ప్రకారం రుణమాఫీ

- 57,983 మంది రైతుల ఖాతాల్లో రూ.415.34 కోట్లు జమ
- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతి రైతు రుణమాఫీ చేస్తామని, మూడు విడతల్లో 57,983 మంది రైతులకు రూ.415.34 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ మొదటి విడత రుణమాఫీలో 28,801 మంది రైతులకు రూ.136.64 కోట్లు, రెండో విడతలో 17,309 మంది రైతులకు రూ.147.33 కోట్లు, మూడో విడతలో 11,873 రైతులకు రూ.131.36 కోట్లను ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తితే గ్రీవెన్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న రైతులు :	3,691
తీసుకున్న పంట రుణాల మొత్తం :	రూ.16,09,84,278
మూడు విడతలు కలిపి మాఫీ జరిగిన రైతులు :	1,690
మంజూరైన నిధులు :	రూ.5,23,56,480
రుణమాఫీకి నోచుకోని రైతులు :	2,001
మంజూరు కావాల్సిన నిధులు :	రూ.10,86,27,798

ఖమ్మం, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'అంతన్నాడు.. ఇంతన్నాడే గంగరాజు' అనే పాటను తలపిస్తున్నది ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ తీరు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే చందంగా కొనసాగుతున్నది ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో పంటల రుణమాఫీ పరిస్థితి. యావత్ జిల్లాలోనే అతిపెద్ద మండలంగా ఖమ్మం రూరల్ ఉంది. ఇక్కడ దాదాపు 15 వేల మందికి పైగా రైతులు ఉన్నారు. కానీ.. మండలంలో ఒకే ఒక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉంది. దశాబ్దాలుగా ఈ సొసైటీలోనే చాలా మంది రైతులు పంట రుణాలు తీసుకుంటూ వ్యవసాయం చేస్తున్నారు. ఈ సొసైటీతోపాటు గ్రామీణ వికాస బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలు ఉన్నప్పటికీ ప్రభుత్వరంగ సంస్థ కావడంతో అనేక మంది సన్న, చిన్నకారు రైతులు ఈ సొసైటీలోనే పంట రుణాలు అధికంగా తీసుకోవడం ఆనవాయితీ. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినట్లుగానే 2018 నుంచి 2023 వరకు రూ.2 లక్షల పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు ఏదులాపురం సొసైటీ వారు అందజేశారు. 3,691 మంది రైతులు అర్హత కలిగి ఉన్నారని ఆ నివేదికలో పేర్కొన్నారు. తొలి విడత నుంచి మొదలైన కోతల రుణమాఫీ చివరి వరకు సైతం అదే జోరు కొనసాగింది. అర్హత ఉన్నా మాకు ఎందుకు రాలేదు రుణమాఫీ అని అడుగుతున్న రైతులకు ఏమని సమాధానం చెప్పాలో తెలియని అధికారులు సాగతీత, దాటవేతకు మాత్రమే యత్నించడం విశేషం. గతంలో కేసీఆర్ హయాంలో వచ్చిన రుణమాఫీ తప్ప ఈ మూడు విడతల్లో ఎక్కడ కూడా తమకు మాఫీ రాలేదని ఆయా గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పొరపాట్లను సరిదిద్దాల్సిన అధికారులు సైతం తప్పించుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో రైతుది.. ఒక్కో రకమైన సమస్య

అర్హత ఉన్నా పంటల రుణమాఫీకి నోచుకోని ఒక్కో రైతు పరిస్థితి ఒక్కో విధంగా ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుత రైతుల పరిస్థితి రాస్తే రామాయణం.. చెబితే భాగవతం అన్నట్లుగా ఉంది. భర్తలు లేని భార్యల పరిస్థితి ఒక విధంగా ఉంటే. ఈ సీజన్‌లో పంట పొలాల వద్ద ఉండాల్సిన రైతులు పక్షం రోజుల నుంచి బ్యాంకులు, సొసైటీ వద్ద పడిగాపులు పడుతున్నారు. ఏదులాపురం సొసైటీ పరిధిలోని దాదాపుగా 28 గ్రామాల రైతుల పరిస్థితి ఇలానే ఉంది. 3 వేల మంది రైతులు కాకుండా రూ.2 లక్షల పైబడి పంట రుణాలు తీసుకున్న రైతుల బాధలు మరింత బాధను కలిగిస్తున్నాయి. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు సైతం రూ.2లక్షల పైబడిన వారికి సైతం మాఫీ చేస్తామని అనేక సార్లు చెప్పారని వారు గుర్తు చేస్తున్నారు. గడిచిన వారం రోజుల నుంచి మా పరిస్థితి గురించి ఎవరూ మాట్లాడడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డు లేనంత మాత్రాన రుణమాఫీ జాబితాలో పేరు లేదని కొందరు బాధ పడుతుంటే, రెండు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు కాబట్టి మీకు మాఫీ రాదు అని అధికారులు చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మరికొందరు. కుటుంబాలు వేరు పడి పట్టాదారు పాసు పుస్తకాలు వేర్వేరుగా ఉండి సాగు చేసుకుంటున్న రేషన్ కార్డు ఒక్కటే కాబట్టి ఆ పేరుతో రుణమాఫీ ఎగ్గొడుతున్నారని రైతులు వాదిస్తున్నారు. ఇలా ఒక్కో రైతు బాధ కార్యాలయం దగ్గర ఒక్కో రకంగా కనబడుతున్నది. నాటి సీఎం కేసీఆర్ రూ.లక్ష మాఫీ చేసినా ఇన్ని కండీషన్లు పెట్టలేదని వారు గుర్తు చేసుకోవడం విశేషం.

- ఖమ్మం రూరల్ సొసైటీ రైతులకు రుణమాఫీ ఎగనామం
- నెలరోజుల తరబడి సొసైటీ చుట్టూ అన్నదాతల చక్కర్లు
- తాజాగా రూ.2 లక్షల పైబడిన రైతుల అగచాట్లు
- సమాధానం చెప్పలేక తలలు పట్టుకుంటున్న సొసైటీ నిర్వాహకులు

వచ్చింది పావు.. రావాల్సింది ముప్పావు



మొదటి విడత నుంచీ తిరుగుతున్న..

రూ.లక్ష లోపు పంట రుణాలు మాఫీ అయిన నాటి నుంచి ఇటు సొసైటీ, అటు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాను. ఈ సారి రాలేదు. రెండో జాబితాలో పేరు వస్తుంది అన్నారు. రెండో జాబితాలో కూడా రాకపోవడంతో మూడో జాబితాలో వస్తుంది అన్నారు. ఇప్పుడు మూడో జాబితా కూడా వచ్చింది. కానీ.. నా పేరు రాలేదు. సొసైటీలో రూ.50 వేలు రుణం తీసుకున్నాను. సెంట్రల్ బ్యాంకులో రూ.1.60 లక్షలు తీసుకున్నాను. అక్కడా మాఫీ కాలేదు. ఇక్కడా మాఫీ కాలేదు. పోనీ రూ.2 లక్షల పైబడి ఉన్న సొమ్ము కడతాను అని చెప్పాను. కానీ.. వారు ఏ సమాధానం చెప్పడం లేదు. పొలం పనులు చేయలేక. ఇటు బ్యాంకుల చుట్టూ తిరగలేకపోతున్నాను.

-బానోతు వస్రాం, రైతు, కస్నాతండా

రుణమాఫీ చేయాల్సిందే..: వరప్రసాద్, రైతు, బొమ్మనపల్లి

నా పేరు బొమ్మెర్ల వరప్రసాద్. మాది టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామం. నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. డీసీసీబీలో రూ.1.30 లక్షలు, ఏపీజీవీబీలో రూ.80 వేలు పంట రుణం తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం షరతులు, కొర్రీలు పెట్టకుండా రైతుల రుణమాఫీ చేయాల్సిందే. రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న రైతులు ఇప్పుడు కట్టాలంటే రైతు భరోసా రాక సతమతమవుతున్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలి.

ఖమ్మం రూరల్ ఏవో కార్యాలయంలో అధికారులను ప్రశ్నిస్తున్న రైతులు

ఎక్కువ, తక్కువలతో సంబంధం వద్దు..: ధరావత్ బాలాజీ, రైతు, శాంతినగర్

నా పేరు ధరావత్ బాలాజీ. మాది టేకులపల్లి మండలం శాంతినగర్. రెండేళ్లుగా మిర్చి తోటలు సరిగా పండకపోవడంతో బ్యాంకులో తీసుకున్న రుణం రూ.2 లక్షల కంటే ఎక్కువగానే ఉంది. ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తే.. మళ్లీ కొత్త రుణం వస్తుందని ఆశపడ్డా. నాకు మాత్రం రుణమాఫీ కాకపోవడం ఆందోళనగా ఉంది. రైతుల పరిస్థితి గురించి ప్రభుత్వం ఆలోచించి రూ.2 లక్షల కంటే ఎక్కువ, తక్కువలతో సంబంధం లేకుండా మాఫీ చేసి ఆదుకోవాలి.

రూ.2 లక్షల పైన రైతులకు కూడా రుణమాఫీ చేయాలి

రూ.2 లక్షలపైన రుణాలు తీసుకున్న రైతులకు కూడా తక్షణమే రుణమాఫీ వర్తింపచేయాలి. రుణమాఫీ ప్రక్రియ మూడు విడతలు పూర్తయినందున రూ.2 లక్షలకు పైబడి రుణాలున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణ విముక్తులు కావాలని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రైతాంగాన్ని బాధ పెట్టడం సరి కాదు. రూ.2 లక్షలు పైన అప్పు ఉన్నవారికి కూడా వారి ఖాతాల్లో ముందుగానే రూ.2 లక్షలు జమ చేసిన తర్వాత మిగిలిన అప్పును రైతులు చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.

- కొమ్మినేని సుధాకర్, సీపీఐ మండల కార్యదర్శి, పెనుబల్లి

రుణమాఫీ మోసంపై అన్నదాతల ఆగ్రహం

- ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై ధర్నా
- ముగ్గురు మంత్రులున్నా అన్యాయం చేశారంటూ ఆవేదన
- సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు

మామిళ్లగూడెం/కొణిజర్ల, ఆగస్టు 17 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా అందిస్తామని చెప్పి మోసం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన 50 మంది రైతులు.. తమకు రుణమాఫీ జరగలేదని, సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్‌లోని సహాయ కేంద్రానికి చేరుకున్నారు. వెంటనే కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధాన గేటు ముందు నుంచి జాతీయ రహదారిపైకి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా బ్యాంకుల్లో ఉన్న తమ రుణాలు మాఫీ కాలేదని, వ్యవసాయాధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా.. తమకు తీవ్రమైన అన్యాయం జరిగిందని వాపోయారు. రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందని అధికారులను అడిగినా సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. గంటపాటు ధర్నా చేసిన రైతులు మళ్లీ ఆగ్రహంతో కలెక్టరేట్‌లోకి చొచ్చుకొచ్చారు. దీంతో అక్కడే బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినా తగ్గకుండా కలెక్టర్ చాంబర్ వరకు వెళ్లిన రైతులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చర్చలు జరిపారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

రుణమాఫీ లేనట్లేనా?

చివరి చూపుదాకా ఎదురుచూసిన రైతులకు చివరికి కాంగ్రెస్ సర్కారు మొండి'చేయి' చూపించింది. మొదటి విడతలో రానివారికి రెండోవిడతలో రుణమాఫీ వస్తుందని, రెండో విడతలో రానివారికి మూడో విడతలోనైనా వస్తుందని ఆశపడిన రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. అసలే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తీర్ణంగా పెద్దది. దీంతో వ్యవసాయ రంగంలో కూడా రైతాంగం ఎక్కువగానే పంటల సాగు చేస్తున్నారు. లక్షల మంది పంటల సాగు చేసే ఈ జిల్లాలో రైతు రుణమాఫీలో మాత్రం కేవలం 57,983 మందికి మాత్రమే మూడువిడతల్లో రుణమాఫీ ఇచ్చి సర్కారు చేతులు దులుపుకుంది. దీంతో జిల్లావ్యాప్తంగా బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

– భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ)

మూడో జాబితాలో కూడా రుణమాఫీకి అర్హత ఉన్న రైతుల పేర్లు కనబడకపోవడంతో అంతటా ఆందోళన చెందుతున్నారు. అసలే రుణమాఫీలో పేర్లు రాలేదని రైతులు గగ్గోలు పెడుతుంటే మరోవైపు సహకార సంఘాల సెక్రటరీలు ఆధార్‌నంబర్లను తప్పులుగా వేయడంతో ఆ రైతుల పేర్లు రుణమాఫీ జాబితాలో రాకపోవడంతో సొసైటీ రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 8 సహకార సంఘాల పరిధిలో 16మంది రైతుల పేర్లు గల్లంతు కావడంతో ఆ సంఘాల కార్యదర్శులకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగింది. పంటల సీజన్ అయిపోతున్నా రైతులు మాత్రం బ్యాంకుల వద్ద పడిగాపులు తప్పడం లేదు. రుణమాఫీ ప్రకటించిన తొలిరోజు నుంచి రైతులు బ్యాంకులు, సొసైటీల వద్దకు రాని రోజంటూ లేదంటే నమ్మాలి. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ సర్కార్ చలించడం లేదు. అప్పులు చేసి సాగు చేస్తే చివరికి పంటల దిగుబడి రాక సమస్యతో ఉంటున్న రైతులకు రుణమాఫీలో పేర్లు లేకపోవడం మరింత ఆందోళనకు గురిచేస్తున్నది. దీంతో గత మూడు విడతలుగా రైతులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. జిల్లాలో మొదటి విడతలో 28,018 మంది రైతులకు రూ.136 కోట్లు, రెండోవిడతలో 16,337 మంది రైతులకు రూ.137 కోట్లు, మూడోవిడతలో 11,873 మంది రైతులకు రూ.131 కోట్లు మంజూరయ్యాయి. మొత్తంగా జిల్లాలో 57,983 మంది రైతులకు గాను రూ.415 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇన్ని నిధులు మంజూరైనా ఒక పంటకు గత కేసీఆర్ సర్కారు ఇచ్చిన రైతుబంధు నగదు అంతలేదని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

- మూడో విడతలోనూ ప్రభుత్వం మొండి'చేయి'
- ఫిర్యాదుల పేరుతో మభ్యపెడుతున్న వైనం
- రైతుల పడిగాపులు చూసీ చలించని కాంగ్రెస్ సర్కార్

రైతుల అభ్యంతరం..

పంటల రుణమాఫీ జాబితా బయటపెట్టకపోవడంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సీఎం సాక్షిగా రుణమాఫీ జాబితా విడుదల చేసినా నేటికీ రైతులకు జాబితాలో పేర్లు బయటకు రాకుండా చేశారు. వ్యవసాయశాఖ అధికారుల్ని అడిగితే మొబైల్ ఫోన్‌కు మెసేజ్ వస్తుందని చెప్పడంతో రైతులు దిగులు చెందుతున్నారు. బయటపెడితే రైతులు ఆందోళన బాట పడతారని అధికారులు సర్దిచెప్తున్నట్లు తెలుస్తుంది.

8 సంఘాల సీఈవోలకు నోటీసులు

రైతుల రుణమాఫీలో తప్పుల తడకలుగా నమోదు చేసిన సొసైటీ సీఈవోలకు జిల్లా అధికారి నోటీసులు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా 8 సహకార సంఘాల కార్యదర్శులకు అర్హత ఉన్న రైతుల పేర్లతో పాటు ఆధార్‌నంబర్లను తప్పుగా వేయడం అవి సరికాకపోవడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. గత రెండు విడతల్లో రుణమాఫీ కొందరికేనా అనే కథనం ప్రచురితంకావడంతో సొసైటీ అధికారులు విచారణ చేపట్టారు. 16మంది రైతుల పేర్లు ఆయా సొసైటీల పరిధిలో గల్లంతు కావడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

రుణమాఫీపై అధికారుల నిలదీత

జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ ఆగ్రహం

కారేపల్లి, ఆగస్టు 17 : ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.2 లక్షల రుణమాఫీ కాకపోవడంతో పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడో విడత రూ.2 లక్షల రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో వివిధ గ్రామాలకు చెందిన రైతులు బ్యాంకులు, వ్యవసాయాధికారి కార్యాలయాలకు వెళ్లి వాకబు చేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు శనివారం ఏడీ కార్యాలయానికి వెళ్లి మండిపడ్డారు. జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవంటూ అధికారులను నిలదీశారు. విడతలవారీగా వస్తుందని అధికారులు రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు.


ఏవో కార్యాలయంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

పకడ్బందీగా ఓటరు జాబితా

వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

మామిళ్లగూడెం, ఆగస్టు 17 : 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటరు హక్కు కల్పిస్తూ పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన.. అదనపు సీఈవో లోకేష్‌కుమార్‌తో కలిసి హైదరాబాద్ సీఈవో కార్యాలయం నుంచి ఓటరు జాబితా సవరణ-2025పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి 1, 2025 ప్రామాణికంగా ఓటరు జాబితా సవరణ చేయాలని సూచించారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి.. అక్టోబర్ 29న ముసాయిదా ప్రకటించాలన్నారు. నవంబర్ 28 వరకు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి.. డిసెంబర్ 24 వరకు పరిష్కరించి.. 2025, జనవరి 6న జాబితా ప్రకటించాలని తెలిపారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం కార్యాచరణ చేసి ఓటరు జాబితా సవరణ పూర్తి చేస్తామన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న అదనపు కలెక్టర్, వైరా ఆర్వో, నేలకొండపల్లి తహసీల్దార్, ఈఆర్వో ఖాళీల విషయంపై సీఈవోకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీఈ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

హరీశ్‌రావు కార్యాలయంపై దాడిని ఖండించిన బీఆర్ఎస్

ఇల్లెందులో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లెందు రూరల్, ఆగస్టు 17 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడిని ఖండిస్తూ.. దాడికి నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పాత బస్టాండ్ సెంటర్‌లో శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు దిండిగల రాజేందర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం గూండాగిరిని ప్రోత్సహిస్తూ దాడులకు పాల్పడడం సరికాదన్నారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అంతలా దాడి జరుగుతుంటే రాష్ట్రంలోని సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్నడూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడలేదన్నారు. కాంగ్రెస్ నాయకుల అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు సిలివేరు సత్యనారాయణ, నాయకులు జబ్బార్, అబ్దుల్ నబి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ భావ్‌సింగ్, డేరంగుల పోషం, ఆదుర్ రవి, రామునాయక్, గిన్నారపు రాజేశ్, హరికృష్ణ, శ్రీను, శివ, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి సరికాదు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 17 : కాంగ్రెస్ గూండాలు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అని, రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు దుయ్యబట్టారు. శనివారం ఆయన తన స్వగృహంలో మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇచ్చిన హామీలను అమలు చేయలేక దాడులకు పాల్పడుతోందన్నారు. గత కేసీఆర్ పదేళ్ల పాలనలో ఇలాంటి దాడులు జరగలేదని, కాంగ్రెస్ వచ్చిన తర్వాతే దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికైనా రౌడీ రాజకీయాలను పక్కనపెట్టి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని హితవు పలికారు. లేదంటే గెలిపించిన ప్రజలే తరిమికొట్టే రోజు వస్తుందన్నారు. ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇలాంటి దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు.

కాంగ్రెస్ గూండాల దాడి హేయమైన చర్య జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు

మధిర, ఆగస్టు 17 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం హేయమైన చర్య అని జడ్పీ మాజీ చైర్మన్, మధిర బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు ఒక ప్రకటనలో ఖండించారు. రుణమాఫీ వంద శాతం చేయకుండా అబద్ధపు ప్రచారం చేస్తూ.. పైగా హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం సరికాదని పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అంతా ప్రశాంతంగా ఉంటే.. ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో దాడులమయంగా నిలిచిందన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే నాయకులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

పోడు భూములకు హక్కులు కల్పిస్తాం.. మంత్రులు కొండా సురేఖ, సీతక్క

మామిళ్లగూడెం, ఆగస్టు 17 : పోడు భూములను వ్యవసాయ సాగు చేస్తున్న అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు విధి విధానాలు రూపకల్పన చేస్తున్నామని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి జిల్లాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తుల్లో అర్హులను గుర్తించాలని, వివాదాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, డీఎఫ్‌వో విక్రమ్‌సింగ్ సిద్దార్థ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్